సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

బుధవారం । 22 । మే । 2024



టన్ను చీనీ రూ.37 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో మంగళవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.37 వేలు, కనిష్టంగా రూ.16 వేల ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



ఏపీఎల్ విజేత ‘రైజింగ్ స్టార్స్’

అనంతపూర్ క్రికెట్ లీగ్ (ఏపీఎల్) – 2 విజేతగా అనంత రైజింగ్ స్టార్స్ నిలిచింది. ఫైనల్ మ్యాచ్‌లో ఇండియన్ సిక్సర్స్‌పై విజయం సాధించింది.

8లో

గరిష్టం/కనిష్టం

35.7°/22.1°

జిల్లా పరిధిలో మంగళవారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఉక్కపోత, వడగాల్పుల తీవ్రత కొనసాగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై కొన్ని మండలాల్లో మోస్తరు నుంచి తేలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

నేడు ఖాద్రీశుని జయంతి



శ్రీదేవి, భూదేవి సమేత వసంత వల్లభుడు

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం సాయంత్రం జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు ఈఓ వి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. శ్రీదేవి, భూదేవి సమేత వసంతవల్లభునికి తిరువీధుల్లో గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు చెప్పారు. భక్తులు తరలివచ్చి ఖాద్రీశుని కృపకు పాత్రులు కావాలని కోరారు.

24 నుంచి టెన్త్ సప్లిమెంటరీ

పుట్టపర్తి: ఈ నెల 24 నుంచి జూన్ 3 వరకు నిర్వహించే పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు జిల్లా విద్యాశాఖ అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసింది. 29 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలకు చెందిన 7,344 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. ఉదయం 9.30 గంటలకే పరీక్షలు ప్రారంభమవుతాయి. విద్యార్థులు 9 గంటలకే విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని డీఈఓ మీనాక్షి సూచించారు.

24న విత్తన మేళా

ధర్మవరం రూరల్: రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించాలనే ఉద్దేశంతో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం– పాలెం వారి ఆధ్వర్యంలో ఈ నెల 24న విత్తన మేళా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం సహ పరిశోధన సంచాలకులు యం.మల్లారెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ రకాల పంటలకు సంబంధించిన నాణ్యమైన విత్తన రకాలను విక్రయానికి అందుబాటులో ఉంచడంతో పాటు పంటల సమగ్ర సమాచారం గురించి శాస్త్రవేత్తలు అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. ఈ నెల 24న ఉదయం 10 గంటలకు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం పాలెంకు తరలిరావాలని రైతులను కోరారు. మరింత సమాచారం కోసం 9490409163 నంబరులో సంప్రదించాలని సూచించారు.

ఇంటర్ సప్లిమెంటరీ పకడ్బందీగా నిర్వహించాలి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌ఓ కొండయ్య

పుట్టపర్తి అర్బన్: ఈ నెల 24 నుంచి ప్రారంభమయ్యే ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని డీఆర్‌ఓ కొండయ్య ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కోర్టు హాల్‌లో ఇంటర్ పరీక్షలపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. డీఆర్‌ఓ మాట్లాడుతూ ఈ నెల 24 నుంచి జూన్ 1 వరకు ఇంటర్ మొదటి, రెండవ సంవత్సరం పరీక్షలు జరగనున్నాయన్నారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు మొదటి సంవత్సరం, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ద్వితీయ సంవత్సరం పరీక్షలు నిర్వహించాలన్నారు. ఇందులో మొదటి సంవత్సరంలో 7,501 మంది, రెండో సంవత్సరం 2,960 మంది కలిపి మొత్తం 10,461 మంది పరీక్షలకు హాజరవుతారన్నారు. జిల్లాలో 28 పరీక్షా కేంద్రాలను, 28 మంది చీఫ్ సూపరింటెండెంట్లను నియమించామన్నారు. ప్రశ్నపత్రాలు భద్రపరిచిన పాయింట్ల నుంచి గట్టి పోలీస్ బందోబస్తు మధ్య పరీక్ష కేంద్రాలకు తరలించాలన్నారు. పరీక్షల సమయంలో ఫ్లయింగ్ స్క్వాడ్ పర్యవేక్షించాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద ప్రజలు గుమికూడకుండా, అవాంఛనీయ ఘటనలు జరగకుండా 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు సకాలంలో చేరుకునేందుకు ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రశ్నపత్రాల పంపిణీలో, జవాబు పత్రాలు తపాలా కార్యాలయాలకు చేరవేయడంలో కావాల్సినన్ని వాహనాలను రవాణా శాఖ సమకూర్చాలన్నారు. కార్యక్రమంలో పరీక్షల నిర్వహణ అధికారి రఘునాథరెడ్డి, ఏఓ రామాంజనరెడ్డి, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ తనిఖీ

లేపాక్షి: డీఎంహెచ్‌ఓ డాక్టర్ మంజువాణి మంగళవారం సాయంత్రం లేపాక్షి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)ని తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి, అన్ని జాతీయ కార్యక్రమాలూ పక్కాగా నిర్వహించడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆమెను వైద్య సిబ్బంది ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ వెంకట చిరంజీవి, డాక్టర్ రాజ్‌కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. రథోత్సవం



మడుగుతేరును లాగుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి



రథంపై కొలువుదీరిన శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి



గోవిందనామ స్మరణ మధ్య సాగుతున్న లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మ రథోత్సవం

- గోవింద నామస్మరణతో పులకించిన ధర్మవరం
- లక్ష్మీచెన్నకేశవస్వామి రథోత్సవానికి పోటెత్తిన భక్త జనం

ధర్మవరం అర్బన్: అశేష భక్త జనసందోహం నడుమ ధర్మవరంలో లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మ రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. గోవింద నామస్మరణతో పట్టణం మార్మోగింది. జిల్లా నుంచేకాకుండా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ నుంచి భక్తులు తరలివచ్చి రథోత్సవాన్ని తిలకించారు. 11 రోజులపాటు సాగే బ్రహ్మోత్సవాల్లో అతి ముఖ్యమైనది బ్రహ్మ రథోత్సవం. మంగళవారం శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఉత్సవ విగ్రహాలు గజ వాహనంపై పురవీధులలో ఊరేగుతూ తేరుబజార్‌కు చేరుకున్నాయి. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన రథంపై స్వామి కొలువుదీరారు. ఉదయం 7 గంటలకు మడుగుతేరు, సాయంత్రం 4గంటలకు బ్రహ్మ రథోత్సవం నిర్వహించారు. మడుగుతేరు (రథోత్సవం)కు ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలయ కమిటీ చైర్మన్ దాశెట్టి సుబ్రహ్మణ్యం, అర్చకులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం రథానికి పూజలు చేసిన ఎమ్మెల్యే మడుగుతేరును లాగారు. ప్రధాన అర్చకులు కోనేరాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. వేలాదిమంది భక్తులు రథం వద్దకు చేరుకుని టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం 4గంటలకు బ్రహ్మ రథోత్సవం ప్రారంభించారు. తేరుబజార్ నుంచి అంజుమన్ సర్కిల్ వరకు భక్తులు గోవింద నామస్మరణతో ఉత్సాహంగా రథాన్ని లాగారు. సాయంత్రం 6గంటలకు ధూళోత్సవం నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

స్ట్రాంగ్ రూంల వద్ద పటిష్ట నిఘా



కౌంటింగ్ రూంల నిర్వాహణ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి

- కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

హిందూపురం: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన ఈవీఎం, వీవీ ప్యాట్‌లు భద్రపరిచిన స్ట్రాంగ్ రూంల వద్ద పటిష్ట నిఘా ఉంచాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి సూచించారు. జిల్లాలోని ఆరు అసెంబ్లీ, హిందూపురం పార్లమెంటు నియోజకవర్గాలకు సంబంధించి పోలింగ్ బ్యాలెట్ యూనిట్స్, కంట్రోల్ యూనిట్స్, వీవీ ప్యాట్‌లు భద్రపర్చిన పట్టణంలోని బిట్ కళాశాల, డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాలలోని స్ట్రాంగ్ రూమ్‌లను కలెక్టర్, ఎస్పీతో పాటు ఎన్నికల అధికారులు మంగళవారం తనిఖీలు చేసి, భద్రతాపరమైన అంశాలపై చర్చించారు. కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ రోజు, మరుసటి దినం జరిగిన సంఘటనల నేపథ్యంలో మూడంచెల భద్రతకు ఏర్పాట్లు చేశామన్నారు. ఆయా కౌంటింగ్ కేంద్రాలలో ఎంట్రన్స్, రోడ్ పాయింట్ వద్ద నుంచే సరైన ధ్రువపత్రాలు ఉంటేనే పంపుతున్నారన్నారు. పోలీసు బలగాలతో బందోబస్తు, 80 సీసీ కెమెరాలతో నిత్యం పర్యవేక్షణ కల్పిస్తున్నామని చెప్పారు. ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. సందేహాలుంటే జిల్లా ఎన్నికల అధికారి, ఎస్పీలను సంప్రదించి వివరాలు తీసుకోవాలని కోరారు. జిల్లాలో ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ భారత ఎన్నికల కమిషన్, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాలు, ఎప్పటికప్పుడు వచ్చే మార్గదర్శకాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. జిల్లాలో కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యేవరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఎస్పీ మాధవరెడ్డి మాట్లాడుతూ స్ట్రాంగ్ రూంల వద్ద భద్రతా సిబ్బంది అప్రమత్తతతో విధులు నిర్వర్తించాలన్నారు. ఈవీఎంలు భద్రపర్చిన కాలేజీల పరిసరాల్లో చుట్టుపక్కల ఎవ్వరూ సంచరించరాదని హెచ్చరించారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్ కుమార్, పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, ఆర్‌ఓలు భాగ్యరేఖ, వెంకట శివసాయిరెడ్డి, గౌరీ శంకర్, నియోజకవర్గాల ఎన్నికల సహాయ అధికారులు, డీఎస్పీ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పెన్నహోబిలం లక్ష్మీ నృసింహుని బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ధ్వజారోహణ చేస్తున్న పండితులు

ఉరవకొండ: పెన్నహోబిలం లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. వేదపండితులు శాస్త్రోక్తంగా అంకురార్పణ చేసి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఆలయ ప్రధాన అర్చకులు ద్వారకనాథచార్యులు ఆధ్వర్యంలో గరుడపట ధ్వజారోహణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా మూలవిరాట్‌తో పాటు శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీనృసింహస్వామికి అర్చకులు విశేష పూజలు, అభిషేకాలు చేశారు. మహావిష్ణువుకు అత్యంత ప్రీతిపాత్రుడైన గరుత్మంతుడి పటానికి ప్రత్యేక పూజలు చేసి స్వామి తిరు కల్యాణోత్సవాలకు సంకేతంగా అటు సకల దేవతలకు, ఇటు మానవజాతికి తెలిసేలా గరుడపట ధ్వజారోహణం గావించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ విజయ్‌కుమార్ అర్చకులు పాల్గొన్నారు.

రథం ట్రయల్ రన్ విజయవంతం

లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని రథం ట్రయల్ రన్ విజయవంతంగా సాగింది. గతేడాది మరమ్మతులు చేస్తున్న సమయంలో క్రేన్ పట్టు తప్పి రథంలోని కొంతభాగం కూలిపోయింది. ఈ క్రమంలో నూతన రథం తయారీ ఇంకా సాగుతుండడంతో పాత రథంతోనే ఉత్సవం నిర్వహించడం అనివార్యమైంది. ఆలయ ఈఓ విజయ్‌కుమార్ ప్రత్యేక చొరవ తీసుకుని పాత రథానికే మరమ్మతులు చేయించారు. ఈ క్రమంలోనే ముందు జాగ్రత్తగా ట్రయిల్ రన్‌ను విజయవంతంగా నిర్వహించారు.

ఎవరి లెక్కలు వారివి

- జిల్లా వ్యాప్తంగా తగ్గని ఎన్నికల వేడి
- పోలింగ్ సరళిపై అభ్యర్థుల అంచనాలు
- బూత్‌ల వారీగా పోలింగ్ శాతం పరిశీలన



కదిరి: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ఈ నెల 13న ముగియడంతో అభ్యర్థుల భవితవ్యం ఈవీఎంలలో నిక్షిప్తమయ్యాయి. జూన్ 4న ఓట్లు లెక్కించనున్నారు. ఇందుకు ఇంకా రెండువారాల సమయం ఉంది. ఈలోగా ఆయా రాజకీయ పార్టీల అభ్యర్థులు, నాయకులు బూత్‌ల వారీగా నమోదైన పోలింగ్ సరళిపై ఎవరిలెక్కలు వారు వేసుకుంటున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మాత్రం గెలుపుపై ధీమాతో ఉన్నారు. కూటమి అభ్యర్థులు పోలింగ్ బూత్‌ల వారీగా లెక్కలు తెప్పించుకొని గెలుపు, ఓటములపై అంచనా వేస్తున్నారు. ఎన్నడూ లేని విధంగా ఈసారి పోలింగ్ శాతం పెరగడంతో ఎవరికి వారు తమకు అనుకూలంగా చెప్పుకుంటున్నారు. పోలింగ్ ముగిసి 10 రోజులు కావస్తున్నా జిల్లా వ్యాప్తంగా ఎక్కడా ఎన్నికల వేడి తగ్గలేదు. ఎక్కడ నలుగురు కలిసినా.. ఏ టీకొట్టులో చూసినా దీనిపైనే చర్చ జరుగుతోంది.

ఎవరికి ఓటు వేశారంటూ ఐవీఆర్‌ఎస్ కాల్స్

ఎన్నికల ప్రచార సమయంలో ప్రధానంగా తెలుగుదేశం పార్టీ వారు ఐవీఆర్‌ఎస్ కాల్స్ ద్వారా జనాన్ని విసిగెత్తించారు. ఇప్పుడు మళ్లీ ఎవరికి ఓటు వేశారంటూ ఐవీఆర్‌ఎస్ కాల్స్ వస్తున్నాయి. దీనికి విసిగిపోయి కొందరు ఫోన్ కట్ చేస్తున్నారు. కొన్ని చోట్ల అభ్యర్థులే ఐవీఆర్ ఎస్ కాల్స్ చేయిస్తుంటే, ఇంకొన్ని నియోజకవర్గాల్లో పందెం రాయుళ్లు ఓటరు నాడి తెలుసుకొని పెద్ద మొత్తంలో బెట్టింగ్‌లు వేసేందుకు ఐవీఆర్ కాల్స్ చేయిస్తున్నారు.

జగన్‌కు జైకొట్టిన జనం!

ప్రస్తుత ఎన్నికల్లో అనూహ్యంగా పెరిగిన పోలింగ్ (81.86) శాతం అధికార వైఎస్సార్‌సీపీకి అనుకూలమని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో రాష్ట్రంలోని ప్రతి కుటుంబం లబ్ధి పొందిందని, అందుకే మళ్లీ జగనే ముఖ్యమంత్రి కావాలని ప్రజలు ఓపికతో క్యూలో నిల్చుని మరీ ఓటు వేశారని పేర్కొంటున్నారు. ముఖ్యంగా అవ్వాతాతలు, అక్కచెల్లెమ్మలు, కొత్తగా ఓటు నమోదు చేసుకున్న యువకులు జగన్‌కు జైకొట్టారని పోలింగ్ సరళిని బట్టి తెలుస్తోందని విశ్లేషిస్తున్నారు.

కొండెక్కిన కోడి



- చికెన్ ధరలు ప్రియం
- కిలో రూ.240 నుంచి రూ.280
- డిమాండ్‌కు తగ్గ సరఫరా లేకపోవడమే కారణం

హిందూపురం/ హిందూపురం అర్బన్: ఈ వేసవిలో కనీవినీ ఎరుగని రీతిలో నమోదవుతున్న ఉష్ణోగ్రతలు కోళ్ల పెంపకంపై తీవ్ర ప్రభావం చూపాయి. ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోయింది. డిమాండ్‌కు తగ్గ సరఫరా లేకపోవడంతో కోడి ధర కొండెక్కి కూర్చుంది. అంతకంతకూ పెరుగుతూ రెండు వారాల వ్యవధిలోనే వంద రూపాయల మేర ధర పెరిగిపోయింది. రూ.160 ఉన్న చికెన్ ప్రస్తుతం ప్రాంతాన్ని బట్టి.. పోటీని బట్టి రూ.240 నుంచి రూ.280కి చేరింది. పెరిగిన ధరల నేపథ్యంలో పలు కంపెనీలు సీడ్ ఇచ్చి ఫాం నిర్వాహకుల ద్వారా కోళ్ల పెంపకం చేపట్టేందుకు ముందుకు వస్తున్నాయి. ఇప్పుడు సీడ్ (కోడి పిల్లలు) తీసుకుని పెంచితే అవి 45 రోజులకు చేతికొస్తాయి. అంతవరకు ధరలు తగ్గే అవకాశం లేదని వ్యాపారులు చెబుతున్నారు.

చికెన్‌కు డిమాండ్ ఎందుకంటే..?

అందరికీ అందుబాటు ధరలో లభించే చికెన్ వైపే మాంసాహారులు మొగ్గు చూపుతున్నారు. మేక, గొర్రె, పొట్టేళ్ల కిలో రూ.800 దాకా ఉంటోంది. దీంతో చాలామంది అటువైపు వెళ్లలేక చికెన్‌నే తీసుకుంటున్నారు. జిల్లాలో 150 కోళ్ల ఫాంలు ఉన్నాయి. హిందూపురం, పెనుకొండ, కదిరి, మడకశిర, గోరంట్ల తదితర ప్రధాన పట్టణాల్లో 2,200, మండల కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాల్లో మరో 1,100 చొప్పున జిల్లా అంతటా 3,300 దాకా చికెన్ సెంటర్లు నడుస్తున్నాయి. రోజూ 30 టన్నులకు పైగా కోళ్లు అమ్ముడుపోతున్నాయి. ఇక ఆదివారాలు, పండుగ రోజుల్లో 40 టన్నుల వరకు విక్రయిస్తున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు.

- కిలో లైవ్ కోడి రూ.150కి కొన్న వ్యాపారి రిటైలర్‌కు రూ.165–170 మధ్య అమ్ముతున్నారు. రిటైలర్ కోడిశుభ్రం చేసి కిలో రూ. 250 నుంచి రూ.280 మధ్య వినియోగదారులకు విక్రయిస్తున్నారు. దుకాణాల బాడుగ, గ్యాస్, క్లీనింగ్, కూలీల ఖర్చు పోను కిలోపై రూ.20–30 మిగులుతోందని చికెన్ సెంటర్ల నిర్వాహకులు చెబుతున్నారు.

దిగుమతి తగ్గింది



ప్రస్తుత వేసవిలో డిమాండ్‌కు సరిపడే విధంగా కోళ్ల దిగుమతి కావడంలేదు. కంపెనీ వారు కూడా ఫారాల్లో ముందస్తుగా బుక్ చేసుకుంటే గానీ అవసరమైనన్ని కోళ్లు అందించలేకపోతున్నారు. అధికశాతం ఫారాలన్నీ కంపెనీ ఆధీనంలోనే ఉండటం, కొత్త బ్యాచ్‌ల పెంపకం, సప్లయ్, ధర పెరుగుదల అన్నీ వారి నిర్ణయం మేరకే ఉంటాయి. మార్చి నుంచి కొత్త బ్యాచ్ కోడి పిల్లలు వేస్తుంటారు. అవిపెరిగి మార్కెట్‌లో వచ్చేసరికి రెండు నెలలవుతుంది. దీనివల్ల మే, జూన్ మాసంలో చికెన్ ధరలు కిలో రూ.300కు చేరే అవకాశాలు లేకపోలేదు. జూలై నుంచి కొత్త బ్యాచ్ (కోళ్లు) మార్కెట్‌కు వస్తే ధరలు తగ్గుముఖం పడుతాయి.

– రవికుమార్, చికెన్ వ్యాపారి, హిందూపురం

వినియోగం పెరిగింది



చికెన్ వినియోగం బాగా పెరిగింది. గొర్రె మాంసం ధరలు పెరిగాయని చాలామంది చికెన్‌నే ఇష్టపడుతున్నారు. చిన్న పిల్లలు కూడా చికెన్ తినడానికే ఆసక్తి చూపుతున్నారు. అయితే డిమాండ్‌కు తగిన మేర కోళ్ల సప్లయ్ లేకపోవడంతో ధరలు పెరిగిపోతున్నాయి. మరోనెల రోజులపాటు ఇలాగే ఉంటుంది.

– యుసూఫ్, హిందూపురం

కొత్త బ్యాచ్ వస్తేనే తగ్గేది

కోళ్ల ఫాంలలో 45 రోజుల పాటు పెంచిన కోళ్లు ఇప్పుడు 2 కిలోల వరకు బరువు తూగుతున్నాయి. వేసవిలో అధిక ఉష్ణోగ్రతలకు కోళ్లు చనిపోతుంటాయి. అందుకే ఈ సీజన్‌లో ధరలు కాస్త ఎక్కువగానే ఉంటాయి. ధరల పెరుగుదలతో వ్యాపారాలు తగ్గుముఖం పట్టాయి. ప్రతి కిలోపై ధరలు పెరిగినా, తగ్గినా మాకు రూ.20–30 ఆదాయం వస్తుంది.

– బాబాజాన్, చికెన్ వ్యాపారి, హిందూపురం

జిల్లా అంతటా వర్షం



పుట్టపర్తిలో కురుస్తున్న వర్షం

పుట్టపర్తి అర్బన్: జిల్లా అంతటా వర్షం కురిసింది. తనకల్లు మండలం మినహా తక్కిన 31 మండలాల్లో సోమవారం రాత్రి బాగా పొద్దు పోయేంత వరకూ 649.6 మి.మీ వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు. హిందూపురంలో 53.8 మి.మీ, అమరాపురం 41.6, గోరంట్ల 38.2, బత్తలపల్లి 37.6, కనగానపల్లి 33.2, నల్లమాడ 31.2, సోమందేపల్లి 30.8, బుక్కపట్నం, కొత్తచెరువు 29.4, ఓడీ చెరువు, తాడిమర్రి 28.4, పరిగి 26.4, ముదిగుబ్బ 24.6, పుట్టపర్తి 19.2, చిలమత్తూరు 16.4, అగళి, పెనుకొండ 16.2, రొళ్ల, లేపాక్షిలో 15.4, రొద్దం 13, మడకశిర 12.2, రామగిరి, సీకేపల్లి, గాండ్లపెంట 10.4, తలుపుల, గుడిబండలో 9.4 మి.మీ వర్షం కురిసింది.

25న భారీ వర్షం!

అనంతపురం అగ్రికల్చర్: ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలో ఈనెల 25న భారీ వర్షం పడే సూచనలు ఉన్నట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సహదేవరెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.నారాయణస్వామి తెలిపారు. ప్రధానంగా అనంతపురం, గుత్తి, ఉరవకొండ డివిజన్లలో మంచి వర్షాలు పడవచ్చన్నారు. ధర్మవరం, కదిరి, హిందూపురం, కళ్యాణదుర్గం, మడకశిర, పెనుకొండ, రాయదుర్గం, తాడిపత్రి డివిజన్లలో వర్షపాతం బాగా నమోదు కావచ్చన్నారు.

క్లుప్తంగా

బీటెక్ విద్యార్థి ఆత్మహత్య


మృతుడు గౌతమ్

పుట్టపర్తి టౌన్: పరీక్షల్లో ఉత్తీర్ణత కాలేకపోతున్నాననే బాధతో ఓ బీటెక్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని ఎనుములపల్లి గణేష్ సర్కిల్‌లో నివాసముంటున్న ఆనంద్, ఉష దంపతులకు ఓ కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమారుడు గౌతమ్ (23) అనంతపురం శివారులోని అనంతలక్ష్మి ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. ఇటీవల నిర్వహించిన పరీక్షల్లో ఏడు సబ్జెక్టుల్లో ఫెయిల్ కావడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. మంగళవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంట్లోనే ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయాన్ని తల్లిదండ్రులు గుర్తించేలోపు విగతజీవిగా మారాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ కొండారెడ్డి తెలిపారు.

15 లీటర్ల నాటు సారా ధ్వంసం

కదిరి అర్బన్: మండలంలోని కట్లతండా పరిధిలో మంగళవారం ఉదయం సిబ్బందితో కలసి రూరల్ అప్‌గ్రేడ్ స్టేషన్ సీఐ మోహన్ కార్డెన్ సెర్చ్ చేపట్టారు. ఆ సమయంలో అక్రమంగా కాస్తున్న 15 లీటర్ల నాటు సారాను గుర్తించి ధ్వంసం చేశారు. అనంతరం సమీప తండాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించారు.

కారు ఢీ - యువకుడికి గాయాలు


గాయపడిన వంశీకృష్ణ

హిందూపురం అర్బన్: డ్రైవింగ్ శిక్షణ సమయంలో అభ్యర్థి అయోమయానికి గురికావడంతో కారు అదుపు తప్పి ఓ యువకుడిపై దూసుకెళ్లింది. మంగళవారం మధ్యాహ్నం హిందూపురంలోని ఎంజీఎం మైదానంలో ఈ ఘటన చోటు చేసుకుంది. స్థానిక డ్రైవింగ్ శిక్షణ కేంద్రానికి చెందిన ఓ కారులో కొందరు డ్రైవింగ్ నేర్చుకుంటున్నారు. ఆ సమయంలో ఓ అభ్యర్థి డ్రైవింగ్ చేస్తూ గందరగోళానికి గురయ్యాడు. దీంతో వాహనం అదుపుతప్పి మైదానంలో పాదచారిగా వెళుతున్న యువకుడు వంశీకృష్ణను ఢీకొంది. తీవ్రంగా గాయపడిన వంశీకృష్ణను వెంటనే ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం యువకుడు కోలుకుంటున్నట్లు వైద్యులు తెలిపారు.

పిడుగుల కాలం.. అప్రమత్తత అవసరం

- పిడుగుపాటుకు పశువులు, జీవాలతో పాటు మనుషులు బలి
- ఉరుములు, మెరుపుల సమయంలో జాగ్రత్తగా ఉండాలంటున్న శాస్త్రవేత్తలు



గత సోమవారం రాత్రి బత్తలపల్లి మండలం ఉప్పర్లపల్లి గ్రామ సమీపంలో పిడుగుపాటుకు దంపెట్ల గ్రామానికి చెందిన జింకా చంద్రశేఖర్ (55) మృతి చెందాడు. ఉప్పర్లపల్లి గ్రామ సమీపంలోని రైతు సుధీర్ పొలంలో కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. సోమవారం రాత్రి పొలం వద్ద ఉన్నప్పుడే వర్షం మొదలైంది. దీంతో ఇంటి దారి పట్టాడు. ఇంతలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం అధికం కావడంతో సమీపంలోని కోళ్లఫాం వద్దకు వెళుతుండగా పిడుగు పడింది. దీంతో ఆందోళనకు గురైన చంద్రశేఖర్ కోళ్లఫాంలోని రైతుల వద్దకు చేరుకుని దాహంగా ఉందని నీళ్లు తాగుతూ కుప్పకూలి మృతి చెందాడు. ఆయన భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.


ఆకాశంలో పిడుగుపాటు దృశ్యం

అనంతపురం అగ్రికల్చర్: ఇటీవల వర్షాకాలం మొదలైతే చాలు పిడుగులు ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నాయి. ఏటా పిడుగు పాటుతో పశు, జీవ సంపదతో పాటు ఇతర మూగ జంతువులు, మనుషులూ ప్రాణాలు కోల్పోతున్నారు. గడ్డివాములు, పూరిగుడిసెలు, చెట్లు కాలిపోయి ఆస్తి నష్టం సంభవిస్తోంది. ఆకాశం మేఘావృతమై మిరుమిట్లు గొలిపే కాంతి (మెరుపు), పెద్ద శబ్దంతో గుడుగు (ఉరుము) వచ్చిందంటే చాలు పిడుగు పడటం గ్యారెంటీ అని ప్రజలు నిర్ధారిస్తున్నారు.

పిడుగుపాటు నష్టాలు మచ్చుకు కొన్ని

- 2023, మే 28న శింగనమల మండలం ఉల్లికల్లు గ్రామానికి చెందిన యువకులు వడ్డే బాలకృష్ణ, గౌరీశంకర్ పిడుగుపాటుతో మృతి చెందారు. ద్విచక్ర వాహనంపై వెళుతున్న సమయంలో వర్షం రావడం వల్ల మధ్యలో ఓ చెట్టు కిందకు చేరుకున్నారు. ఆ సమయంలో పిడుగు పాటుకు గురై అక్కడికక్కడే మృతిచెందారు.
- 2023, మే 31న గుమ్మఘట్ట మండలం దేవిరెడ్డిపల్లిలో పిడుగుపాటుకు గొల్ల పరమేష్‌కు చెందిన 10 గొర్రెలు మృత్యువాతపడ్డాయి. రూ.లక్షకు పైగా నష్టం వాటిల్లింది.
- 2023, జూన్ 1న యాడికి మండలం రాయలచెరువు గ్రామంలో పిడుగుపాటుకు రైతు దస్తగిరికి చెందిన పాడి ఆవు మృత్యువాత పడింది. రూ.50 వేలకు పైగా నష్టం జరిగింది.

పిడుగు అంటే

వాతావరణంలో ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్నప్పుడు నీరు ఆవిరిగా మారి ఆకాశంలో దాదాపు 25 వేల అడుగుల ఎత్తు వరకు మేఘాలు ఏర్పడతాయి. అయితే పైనుంచి సూర్యరశ్మి అధికంగా తాకడం వల్ల తక్కువ బరువున్న ధనావేశిత మేఘాలు పైకి వెళ్తాయి. అధిక బరువుండే రుణావేశిత (ఎలెక్ట్రాన్లు అధికంగా ఉన్నటువంటి) మేఘాలు కిందకు వస్తాయి. అంటే మనకు కనిపించే దట్టమైన మబ్బుల్లాంటి మేఘాల్లో ఎలెక్ట్రాన్లు ఎక్కువగా ఉంటాయి. సైన్స్ ప్రకారం రుణావేశిత మేఘాల్లోని ఎలెక్ట్రాన్లు ధనావేశిత మేఘాల వైపు ఆకర్షితమవుతుంటాయి. అయితే ధనావేశిత మేఘాలు చాలా ఎత్తుకు వెళ్లినపుడు దగ్గరలో ఏ వస్తువున్నా అటువైపు ఎలెక్ట్రాన్లు ప్రయాణిస్తాయి. ఈ క్రమంలో మేఘాల నుంచి ఎలెక్ట్రాన్లు ఒక్కసారిగా విడుదలై విద్యుత్ వలయంగా మారి భూమి మీదకు దూసుకువస్తాయి. వాటినే మనం పిడుగులుగా పిలుస్తాం. మరో రూపంలో ఆకాశంలో మేఘాలు పరస్పరం ఢీకొన్న సమయంలో వెలువడే కాంతిని మెరుపు. వచ్చే శబ్దాలను ఉరుములు, విడుదలయ్యే విద్యుత్‌ను పిడుగు అంటారు. ఒక్క పిడుగు ద్వారా కొన్ని కోట్ల వాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసే శక్తి ఉంటుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఒక పిడుగులో దాదాపు 30 కోట్ల ఓల్టుల విద్యుత్ ఉంటుందని అంటున్నారు. అది ఎంత శక్తివంతమైనదంటూ పిడుగు మనిషిని నేరుగా తాకితే అక్కడిక్కడే బూడిదైపోవడం ఖాయం.

జాగ్రత్తలు తప్పనిసరి



“ పిడుగుపాటుకు గురికాకుండా ప్రజలు సరైన జాగ్రత్తలు తీసుకోవాలి. పొలాల్లో ఉన్న రైతులు, కూలీలు సాధ్యమైనంత తొందరగా సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలి. పిడుగు ప్రభావంతో లక్షల సెంటీగ్రేడ్లతో ఉత్పత్తి అయ్యే వేడి మనుషులపై పడితే తక్షణం గుండెపై ప్రభావం చూపుతుంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తున్నప్పుడు చెట్ల కింద, ఎత్తైన ప్రదేశాల్లో ఉండకూడదు. ఎడ్లబండి, ద్విచక్ర వాహనం, ట్రాక్టర్ లాంటి వాహనాలు నడపకూడదు. నీళ్లలో ఈతకొట్టరాదు. ఎక్కువ నీరు ఉన్న ప్రాంతాల్లో ఉండకూడదు. ఫోన్‌లో మాట్లాడకూడదు. టీవీలు, ఇతర విద్యుత్ సాధనాలు కాలిపోయే ప్రమాదం ఉన్నందున విద్యుత్ వాహకాలను తొలగించాలి. విద్యుత్ తీగలు, కరెంటు స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లకు అతి సమీపంలో ఉండకూడదు. చెప్పులు లేకుండా బయటకు వెళ్లకూడదు. అటవీ ప్రాంతాల్లో ఉండకూడదు.

– డాక్టర్ బి.సహదేవరెడ్డి, శాస్త్రవేత్త, రేకులకుంట వ్యవసాయ పరిశోధన స్థానం

మైదాన ప్రాంతాల్లో ఎక్కువ



పిడుగుపాటు మరణాలు సాధారణంగా మైదాన ప్రాంతాల్లో ఎక్కువగా ఉంటాయి. మైదాన ప్రాంతాల్లో ఉన్న సమయంలో మెరుపులు కనిపించిన వెంటనే నేలపై మోకాళ్లమీద కూర్చొని తల కిందకు వంచి ఉండాలి. ఎత్తైన చెట్లు, శిథిల భవనాల కింద ఉండకూడదు. వ్యవసాయ పనుల్లో ఉన్న వారు అందరూ ఒకే చోట గుంపుగా ఉండకూడదు.నేలపై బోర్లా పడుకోకుండా తలవంచి మోకాళ్ల మీద కూర్చోవడం ఉత్తమం. గొడుగులు వాడకూడదు, చేతిలో పలుగు, పార లాంటి ఇనుప వస్తువులు ఏవీ ఉండకూడదు. సెల్‌ఫోన్‌లో మాట్లాడటం, కెమెరా ద్వారా ఫొటోలు తీయడం మంచిది కాదు. ఉరుముల సమయంలో పాత్రలు కడగడం, స్నానం చేయడం మంచిదికాదు. ఇళ్లపై పిడుగు పడడం చాలా అరుదుగా ఉంటుంది. పిడుగు బారి నుంచి తప్పించుకునేందుకు నివాస గృహాలే మేలు.

– డాక్టర్ జి.నారాయణస్వామి, శాస్త్రవేత్త, రేకులకుంట వ్యవసాయ పరిశోధన స్థానం

విద్యుదాఘాతంతో ఆవు మృతి


మృతి చెందిన ఆవు

హిందూపురం అర్బన్: స్థానిక రహమత్‌పూర్ సర్కిల్ నుంచి కిరికెరకు వెళ్లే మార్గంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ షాక్‌కు గురై ఓ ఆవు మృతి చెందింది. సోమవారం రాత్రి కురిసిన వర్షం కారణంగా ట్రాన్స్‌ఫార్మర్ నుంచి దిమ్మెకు విద్యుత్ సరఫరా అయింది. మంగళవారం ఉదయం ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసిన దిమ్మె వద్ద గడ్డి మేస్తున్న ఆవు షాక్ గురై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. ఘటనపై ఆటోనగర్ వాసులు మాట్లాడుతూ... ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు చేయకపోవడం వల్లనే ఈ ప్రమాదం జరిగిందని తెలిపారు. కంచె ఏర్పాటు చేయాలని పలుమార్లు విద్యుత్ శాఖ అధికారులకు విన్నవించినా వారు పట్టించుకోవడం లేదని వాపోయారు. ఘటనపై ట్రాన్స్‌కో ఈఈ భూపతి మాట్లాడుతూ.. ఆవు మృతిపై విచారణ చేపట్టి, ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు.

ఘర్షణ కేసులో ముగ్గురి అరెస్ట్

ధర్మవరం రూరల్: మండలంలోని ఓబుళనాయనపల్లిలో ఎన్నికల అనంతరం జరిగిన ఘర్షణలో మంగళవారం ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు రూరల్ ఎస్‌ఐ నరేంద్ర తెలిపారు. అరెస్ట్ అయిన వారిలో శ్రీనివాసులు, సోమశేఖర్, అనంతరాయుడు ఉన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరుపరిచినట్లు పోలీసులు తెలిపారు.

23 మంది బైండోవర్


వివరాలు ఆరా తీస్తున్న డిప్యూటీ తహసీల్దార్ భాగ్యలక్ష్మి

రొళ్ల: ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎలాంటి ఘర్షణలు, అలజడులు తలెత్తకుండా వివిధ రాజకీయ పార్టీలకు చెందిన 23 మందిని మంగళవారం తహసీల్దార్ భద్రుజమ, డీటీ భాగ్యలక్ష్మి ఎదుట హాజరు పరిచి బైండోవర్ చేసినట్లు ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరూ శాంతియుత వాతావరణంలో మెలగాలన్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత గ్రామాల్లో ఊరేగింపులు, బహిరంగ సభలు, టపాసులు పేల్చడం లాంటివి చేయకూడదని ఆదేశించారు.

గుత్తి ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ రాజ్‌కుమార్ హఠాన్మరణం

గుత్తి రూరల్: ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ, గుత్తి మండల ఎన్నికల నోడల్ అధికారి జీవీ రాజ్‌కుమార్(53) మంగళవారం హఠాన్మరణం చెందారు. రెండు రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన మంగళవారం ఉదయం ఛాతీలో నొప్పిగా ఉందని చెప్పారు. దీంతో కుటుంబసభ్యులు అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స సమయంలోనే పరిస్థితి విషమించి ఆయన మృతి చెందారు. ఆయనకు భార్య, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. కాగా, రాజ్‌కుమార్ స్వస్థలం వైఎస్సార్ జిల్లా కడప. ఉద్యోగరీత్యా అనంతపురంలో ఆయన స్థిరపడ్డారు. రాజ్‌కుమార్ మరణవార్త తెలుసుకున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ ఎహసాన్‌బాషా, ఈఈ జవహర్‌కుమార్, జిల్లాలోని డీఈఈ, ఏఈఈ, జేటీఓ, ఇతర ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది అనంతపురంలోని డీఈఈ నివాసానికి చేరుకుని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు.

తల్లిదండ్రుల చెంతకు బాలికలు


బాలికలకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, పీఓ వెంకటేశ్వరి

అనంతపురం సిటీ: బెంగళూరు సిటీ చూడాలన్న ఆకాంక్షతో ఇంటి నుంచి పారిపోయి వచ్చిన ముంబయికి చెందిన ఇద్దరు బాలికలను రైల్వే పోలీసులు కాపాడి సురక్షితంగా తల్లిదండ్రుల వద్దకు చేర్చారు. వివరాలు... ముంబయిలోని కుంచికుట్టేరి ప్రాంతానికి చెందిన 14, 15 ఏళ్ల వయసున్న ఇద్దరు బాలికలు ఈ నెల 18న ఇంట్లో చెప్పకుండా ఉద్యాన్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కారు. తమ పిల్లలు కనిపించకపోవడంతో ఆందోళనకు గురైన వారి తల్లిదండ్రులు ముంబయి పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయాన్ని వెంటనే దేశవ్యాప్తంగా ఉన్న అన్ని రైల్వే, పోలీస్ స్టేషన్లకు ముంబయి పోలీసులు చేరవేశారు. ఈ క్రమంలో రైలు గుంతకల్లుకు చేరుకోగానే రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్(ఆర్‌పీఎఫ్) పోలీసులు బోగీలను గాలించారు. ఆ సమయంలో అనుమానాస్పదంగా కనిపించిన ఇద్దరు బాలికలను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించి వివరాలు ఆరా తీశారు. బెంగళూరు చూడాలన్న కోరిక ఎప్పటి నుంచో ఉందని, అయితే తమ కుటుంబాల ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోవడంతో చెప్పాపెట్టకుండా రైలెక్కి వచ్చేసినట్లు బాలికలు వివరించారు. ఆర్‌పీఎఫ్ నుంచి సమాచారం అందుకున్న ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి ఆదేశాల మేరకు బాలల సంక్షేమ సమితి డీసీపీఓ మంజునాథ, పీఓ(ఐసీ) వెంకటేశ్వరి గుంతకల్లుకు వెళ్లి బాలికలను అనంతపురానికి తీసుకువచ్చారు. ఇద్దరినీ సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి ఎదుట హాజరుపరిచి, కౌన్సెలింగ్ అనంతరం కుటుంబసభ్యులకు సమాచారం అందించి, వారొచ్చే వరకూ బుడ్డప్పనగర్‌లోని చిల్డ్రన్ హోంలో ఆశ్రయం కల్పించారు. మూడు రోజుల అనంతరం మంగళవారం అనంతపురానికి చేరుకున్న తల్లిదండ్రులకు బాలికలను సురక్షితంగా అప్పగించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, డీసీపీఓ మంజునాథ, పీఓ వెంకటేశ్వరి, ఐసీపీఎస్ సోషల్ వర్కర్ వసంత తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ హత్యకేసులో నిందితుల అరెస్ట్

గోరంట్ల: మండలంలోని కొత్తబోయినపల్లి సమీపంలో ఆదివారం సాయంత్రం మల్లాపల్లి గ్రామ మాజీ వలంటీర్ అనిల్‌కుమార్ యాదవ్ హత్య కేసులో నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గోరంట్ల సీఐ సుబ్బరాయుడుతో కలసి పెనుకొండ డీఎస్పీ షేక్ బాజీజాన్‌సైదా వెల్లడించారు. మల్లాపల్లికి చెందిన అనిల్‌కుమార్... మరో ఇద్దరు స్నేహితులతో కలసి కర్ణాటకలోని బాగేపల్లి తాలూకా పెసలపర్తి గ్రామానికి ఆదివారం సాయంత్రం మద్యం సేవించేందుకు వెళ్లాడు. అదే క్రమంలో కొత్తచెరువుకు చెందిన సైఫుల్లా తన ఐదుగురు స్నేహితులతో కలసి కారులో పెసలపర్తికి చేరుకున్నాడు. ఇరు వర్గాలు మద్యం కొనుగోలు చేసి, సమీపంలోని వ్యవసాయ పొలాల్లో పక్కపక్కనే కూర్చొని సేవించారు. ఆ సమమయంలో సైఫుల్లా స్నేహితులు మద్యం మత్తులో గట్టిగా కేకలు వేయడంతో అనిల్‌కుమార్, అతని స్నేహితులు వారించారు. ఆ సమయంలో కోపగించుకున్న సైఫుల్లా, మిత్రబృందం వాగ్వాదానికి దిగి అనిల్‌కుమార్, అతని స్నేహితులను బెదిరించారు. అనంతరం స్నేహితులతో కలసి స్వగ్రామానికి ద్విచక్ర వాహనాల్లో అనిల్‌కుమార్ బయలుదేరాడు. కొత్తబోయినపల్లి సమీపంలోకి చేరుకోగానే వెనుకనే కారులో వచ్చిన సైఫుల్లా, అతని స్నేహితులు ద్విచక్ర వాహనంపై వెళుతున్న అనిల్‌కుమార్‌ను అడ్డుకుని దాడి చేశారు. ఘటనలో అనిల్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. హతుడి తండ్రి నరసింహప్ప ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు వేగవంతం చేశారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం నిందితులు దూదేకుల సైఫుల్లా, ముష్టూరి కుమార్, గొల్ల రఘునాథ్‌యాదవ్, గణేష్‌కుమార్, చింతకాయల హేమంత్‌కుమార్, గొల్ల సాయినాథ్ యాదవ్ కొత్తచెరువు వీఆర్వో ఓబులేసు ఆధ్వర్యంలో పోలీసుల వద్ద లొంగిపోయారు. కాగా, నిందితులను న్యాయస్థానంలో హాజరుపరిచే క్రమంలో వైద్య పరీక్షలకు గోరంట్లలోని ప్రభుత్వాస్పత్రికి పోలీసులు తీసుకెళ్లారు. వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం ఫిట్ నెస్ సర్టిఫికెట్ ఇచ్చేందుకు వైద్యాధికారి పావని నిరాకరించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తాను ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఇవ్వలేనంటూ రాతపూర్వకంగా ఆమె పోలీసులకు ఇచ్చారు.

ద్విచక్ర వాహనాలు ఢీ– ఒకరి మృతి

- ఇద్దరికి తీవ్ర గాయాలు


ఆనంద్ (ఫైల్)

చెన్నేకొత్తపల్లి: ద్విచక్ర వాహనాలు పరస్పరం ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... చెన్నేకొత్తపల్లికి చెందిన మోహన్‌రెడ్డి, తన బంధువు సాయినాథరెడ్డితో కలసి ద్విచక్ర వాహనంపై మంగళవారం ఉదయం రామగిరి మండలంలోని నసనకోట ముత్యాలమ్మ దేవాలయానికి బయలుదేరారు. రామగిరి మండల సరిహద్దులో నిర్మించిన ఆర్చ్ దాటగానే ఎదురుగా కనగానపల్లి మండలం తల్లిమడుగుల గ్రామానికి చెందిన కుమ్మర రంగ రత్నమ్మ, నాగరాజు దంపతుల ఏకైక కుమారుడు ఆనంద్ (23) ద్విచక్ర వాహనంపై ఎస్‌ఎస్ గేట్ వైపుగా దూసుకెళుతూ ఢీకొన్నాడు. ఘటనలో ముగ్గురూ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను అటుగా వెళుతున్న వారు గుర్తించి వెంటనే 108 అంబులెన్స్ ద్వారా అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు. మార్గమధ్యంలో ఆనంద్ మృతి చెందాడు. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు బెంగళూరుకు కుటుంబసభ్యులు తీసుకెళ్లారు. ఘటనపై చెన్నేకొత్తపల్లి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, కేసు నమోదు విషయంగా రెండు మండలాల పోలీసుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ప్రమాదం జరిగిన ప్రాంతం మీదంటే కాదు మీదని చెన్నేకొత్తపల్లి, రామగిరి మండలాల పోలీసులు వాదులాడారు. దాదాపు రెండు గంటల పాటు వివాదం కొనసాగింది. చివరకు వీఆర్వోలు, వీఆర్‌ఏలు అక్కడకు చేరుకుని సర్వేయర్‌ను పిలిపించి హద్దులు నిర్ణయించడంతో చెన్నేకొత్తపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.

రక్తహీనతను నియంత్రించండి


రక్తహీనతపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

పరిగి: ప్రజారోగ్యం కాపాడలన్న లక్ష్యంతో అనేక సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని, ఈ క్రమంలో ఎక్కడేగాని రక్తహీనత మాట వినపడకూడదని పీహెచ్‌సీ వైద్యాధికారులను జిల్లా వైద్యారోగ్యశాఖ టాస్క్‌ఫోర్స్ అధికారులు ఆదేశించారు. పరిగి మండలం శాసనకోట ఆరోగ ఉపకేంద్రాన్ని జిల్లా ఆరోగ్య కార్యక్రమాల మేనేజర్ పల్లా నాగరాజు, డేటా మేనేజర్ సుబ్బారావు, పరిగి పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ నవీన, డాక్టర్ స్వరూపరెడ్డి మంగళవారం సందర్శించారు. రక్తహీనతపై సమీక్షించారు. గర్భిణులు, బాలింతల కోసం ప్రస్తుతం మెరుగైన పోషకాహార పదార్థాలను అందించడంతో పాటూ మాతాశిశువుల కోసం పోషకాలతో కూడిన ఆహార పదార్థాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. గర్భస్థ శిశు దశలోనే పౌష్టికాహార లోపం లేకుండా చర్యలు తీసుకుంటే భవిష్యత్తులో రక్తహీనత అనే మాట వినపడదన్నారు. అనంతరం రికార్డులు తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. బీసీజీ టీకాల పంపిణీపై ఆరా తీశారు. ఓపీ సేవలను పెంచడంతో పాటూ ప్రభుత్వాసుపత్రిలో ప్రసవాల సంఖ్య మరింత పెంచాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ వన్నప్ప, ఏఎన్‌ఎం అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

శాసనాల్లో అగస్త్య ముని ప్రస్తావన


శాసనాలు చూపుతున్న మైనాస్వామి

పెనుకొండ: పట్టణంలోని ఐముక్తేశ్వరాలయంలో ఉన్న శాసనాల్లో అగస్త్య మహాముని ప్రస్తావన ఉన్నట్లుగా చరిత్రకారుడు మైనాస్వామి తెలిపారు. మంగళవారం ఆయన ఐముక్తేశ్వరాలయాన్ని సందర్శించి శాసనాలను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ... పురాణ పురుషులు, రుషుల ఆగమనం గురించి తెలిపే శాసనాలు అరుదుగా ఉంటాయన్నారు. వేద కాలం నాటి అగస్త్యుని ప్రయాణం గురించి శాసనాల్లో ఉండడం చరిత్రకారులను అబ్బురపరిచే విషయమన్నారు. వింధ్య పర్వతాల్లో నివసించిన అగస్త్యుడు కాశీ క్షేత్రానికి వెళ్లడం, తిరిగి కాశీ నుంచి బ్రహ్మపురం (నేటి పెనుకొండ) వచ్చి ఘనగిరిపై గల బ్రహ్మ సరస్సు పక్కన తపమాచరించినట్లుగా శాసనాల్లో ఉందన్నారు. అలాగే మహాముని మలి అవతారంలో వామనేంద్రుని స్మృతిగా ఓ శివాలయాన్ని నిర్మించినట్లుగా ఉందన్నారు.

ఏపీఎల్ విజేత ‘రైజింగ్ స్టార్స్’



విజేత ట్రోఫీ అందుకుంటున్న అనంత రైజింగ్ స్టార్స్ జట్టు

అనంతపురం: అనంతపూర్ క్రికెట్ లీగ్ (ఏపీఎల్) – 2 విజేత ట్రోఫీని అనంత రైజింగ్ స్టార్ గెలుచుకుంది. అనంత క్రీడాగ్రామంలోని ప్రధాన మైదానంలో మంగళవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ఇండియన్ సిక్సర్స్, అనంత రైజింగ్ స్టార్స్ తలపడ్డాయి. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న రైజింగ్ స్టార్స్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 132 పరుగులు చేసింది. జట్టు బ్యాటర్ బి.ప్రశాంత్ 56 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్లు 58 పరుగులు చేశారు. ఇండియన్ సిక్సర్స్ బౌలర్లు హరిశంకర్‌రెడ్డి, ఎం.ఖాన్, వి.సంజయ్ నాయుడు చెరో రెండు వికెట్లు చొప్పున తీశారు. తర్వాత బ్యాటింగ్ చేసిన ఇండియన్ సిక్సర్స్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 113 పరుగులకే కుప్పకూలింది. కోగటం హనీష్ వీరారెడ్డి 35 పరుగులు, ప్రవీణ్‌కుమార్ రెడ్డి 22 పరుగులతో రాణించారు. రైజింగ్ స్టార్స్ బౌలర్లు ఎం.దీపక్ , షాహిద్ చెరో రెండు వికెట్లు తీశారు. 19 పరుగులతో అనంత రైజింగ్ స్టార్స్ గెలిచి టైటిల్‌ను సొంతం చేసుకుంది. విజేత జట్టును అభినందిస్తూ ట్రోఫీని ఆర్డీటీ చైర్మన్ ఎం.తిప్పేస్వామి అందజేశారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును బి.ప్రశాంత్‌కు భారత మహిళా మాజీ క్రికెటర్ సునేత్ర పరాన్జపే అందజేశారు. కార్యక్రమంలో ఐపీఎల్ మాజీ క్రీడాకారుడు పైడికల్వ విజయ్‌కుమార్ (డెక్కన్ ఛార్జర్స్), కె.మధు ఆచారి, బీఆర్ ప్రసన్న, షబ్బీర్ అహమ్మద్, భీమలింగారెడ్డి, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్‌కుమార్ యాదవ్, నగర డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కరరెడ్డి, డాక్టర్ సుప్రియా చౌదరి, కోచ్‌లు పాల్గొన్నారు.